క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణం



మోపిదేవి: మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ హనుమత్, సీత లక్ష్మణ పరివార శ్రీ కోదండరామస్వామి ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం తొమ్మిది గంటలకు స్వామి వారికి అభిషేకం, కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిగింది.

షైనింగ్ స్టార్స్‌కు సన్మానం

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతలు షేక్ హుమైరా కౌకబ్, కుప్పా పావనికి కళాశాలలో శుక్రవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. వీరితో పాటు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 12 మంది విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకినీడు ప్రసాద్‌కు నివాళి



చల్లపల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.సూర్యప్రసాదరావు, వార్డు సభ్యులు మీర్ రిజ్వాన్, అంబటి భువనేశ్వరరావు, షేక్ సిలార్, అల్లంశెట్టి శ్రీరంగనాయకమ్మ, కంతేటి నళిని, షేక్ జమీలా, రావులపల్లి విజయమనోజ్‌కుమారి తదితరులు పాల్గొని అంకినీడు ప్రసాద్‌కు నివాళులు అర్పించారు.


తైక్వాండో పోటీల్లో సాత్వికకు బంగారు పతకం

తెలుగురావుపాలెం(ఘంటసాల): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన చిట్టూరి సాత్విక భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించాలని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు. తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన సాత్విక ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ – 14 తైక్వాండో పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం సాధించి జాతీయ జట్టుకు ఎంపికైంది. సాత్విక తల్లిదండ్రులు చిట్టూరి వనిత, నరసింహారావు, తైక్వాండోలో శిక్షణ ఇచ్చిన మాస్టర్ సుబ్బారావు, సింహాద్రి జాహ్నవిని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు శుక్రవారం అభినందించారు. సాత్వికకు మాజీ సర్పంచులు ఆరుంబాక రవి, పైడిపాముల నెహ్రూ, గుత్తికొండ చారిటబుల్ ట్రస్టు అధినేతలు గుత్తికొండ కళ్యాణ్, గుత్తికొండ రవి బాబు అభినందనలు తెలిపారు.

దివి ఎడమ కరకట్ట అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరు

అవనిగడ్డ: దివి ఎడమ కరకట్ట అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడూరు మండలంలోని ఉల్లిపాలెం వారధి నుంచి హంసలదీవి పుష్కర ఘాట్ వరకూ కరకట్ట అభివృద్ధికి ఈ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. తరచూ కోతకు గురయ్యే ఈ ప్రాంతం వరదల సమయంలో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని వివరించారు. నిధులు మంజూరుతో ఈ ప్రాంత కరకట్ట బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

హిందూ ధర్మ ప్రచారం కోసం టీటీడీ కృషి



బంటుమిల్లి: హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గ్రామగ్రామాన టీటీడీ ఆధ్యాత్మిక, ధార్మిక, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణాజిల్లా ప్రతినిధి తురగా ప్రసాదు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద నాలుగు రోజులుగా జరుగుతున్న ఆధ్యాత్మిక, ధార్మిక, ప్రవచన కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపులో భాగంగా మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు స్వామివారి గోవిందనామాల పుస్తకం, రూపు, తోరణం, పసుపు, కుంకుమలు అందజేశారు. ఆలయ అర్చకుడు బృందావనం వేణుగోపాలాచార్యులు వేద మంత్రాల మధ్య కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి.

మంచినీటి చెరువులో చేపల సాగు

- చోద్యం చూస్తున్న అధికారులు
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



చేపలు సాగుచేస్తున్న బల్లిపర్రు గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువు

పెడన: మండలంలోని బల్లిపర్రు గ్రామంలో రక్షిత మంచినీటి చెరువులో కొందరు చేపలు సాగుచేస్తున్నారు. మంచినీటి చెరువులో చేపలు పెంచడమే కాకుండా రసాయనాలతో కూడిన మేతను కూడా వాడుతున్నారు. ఫలితంగా తాగునీరు కలుషితం అవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీరు కలుషితమై, ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం చెరువు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు.

బల్లిపర్రు గ్రామస్తులకు రక్షిత తాగు నీరు అందించేందుకు మంచి నీటి చెరువు ఉంది. ఈ చెరువులో కొంతమంది యథేచ్ఛగా చేపలు సాగుచేస్తున్నారు. చెరువులో చేపలకు మేత వేస్తూ, పట్టుబడులు పడుతున్నారు. మంచినీటి చెరువులో చేపలు పెంచడమే కాకుండా రసాయనాలతో కూడిన మేతను నిత్యం అందిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తాగునీరు కలుషితం కారణంగా ఏదైనా ఉపద్రవం వస్తే అప్పుడు చర్యలు చేపట్టడం కంటే ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే బాగుంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మంచినీటి చెరువులో చేపలను పెంచుతున్న వారిని చూసి గ్రామస్తులు భయపడుతున్నారు. కనీసం వారిపై ఫిర్యాదు చేసేందుకు కూడా ముందుకు రావడంలేదు. ఏ స్థాయిలో వారు గ్రామస్తులను బెదిరిస్తున్నారో దీనిని బట్టే అర్థమవుతోంది. కలుషితమైన నీటిని తాగలేక, కనీసం పశువులకు అయినా తాగునీరు అందించాలంటే వాటికి ఏమైనా జబ్బులు వస్తాయేమోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతోంది. మరో పక్క కూటమి సర్కారు 'సుపరిపాలన' అంటూ బహిరంగ సభలు పెడుతుంటే క్షేత్రస్థాయిలో ఇటువంటి వాటి గురించి చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారంటూ



చెరువు పక్కనే ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల పక్షాన పోరాటం చేసిన స్థానిక నాయకులు కొందరు అధికారం రాగానే ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం, మంచినీటి చెరువులో జలాలను చేపలు సాగుచేసి కలుషితం చేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెబితే ఒక బాధ, చెప్పకపోతే మరొక బాధ అన్నట్లు తమ పరిస్థితి ఉందని వాపోతున్నారు.

మండల స్థాయి అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం మినహా చేసేదేమీ లేదని పేర్కొంటున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే అయినా తాగునీరు కలుషితం కాకుండా ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



రక్షిత మంచినీటి చెరువులో చేపలు పెంచుతున్నారని ఫిర్యాదు నాకు అందింది. తక్షణమే చెరువును పరిశీలించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టంచేశాం. నాలుగైదు రోజుల్లో స్వయంగా వెళ్లి పరిశీలించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– ఫర్హతుల్లా బేగ్,
ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ, పెడన మండలం

స్వచ్ఛందంగా గుర్రపుడెక్క తొలగింపు

బంటుమిల్లి: మండలంలోని ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను రైతులు శుక్రవారం స్వచ్ఛందంగా చేపట్టారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మండలంలో అత్యధికంగా వెద పద్ధతిలో వరి సాగుచేస్తారు. ఇప్పటికే డ్రెయిన్ పరిధిలోని రైతులు పొలాల్లో విత్తనాలను వెదజల్లారు. పొలాల్లో నీరు నిలిస్తే విత్తనాలు కుళ్లిపోతాయన్న భయంతో డ్రెయిన్ పరిధిలోని రైతులు ఎకరాల లెక్కన డబ్బులు వసూలు చేసి కూలీలతో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. పెదతుమ్మిడి నీటి సంఘం పరిధిలో ఉన్న ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్ గురించి సంఘం పట్టించుకోకపోవడంతో రైతులే ముందుకు వచ్చి ఈ పనులు చేపట్టారు. గతంలో కూడా డ్రెయిన్ పరిధిలో ఆముదాలపల్లి, లక్ష్మీనారాయణపురం, జయపురం, రామవరప్పుమోడి గ్రామాల రైతులు లక్షలాది రూపాయలతో



ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క తొలగిస్తున్న కూలీలు

డ్రెయిన్ తవ్వకం పనులు పూర్తి చేసుకున్నారు. దీనిపై డ్రెయినేజీ ఏఈ కుమార్ స్పందిస్తూ మైనర్, మీడియం డ్రెయిన్లలో తూడు, కిక్కిస తొలగింపు పనుల కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆముదాలపల్లి డ్రెయిన్ కూడా అందులో ఉందని, నీటి సంఘం ఆధ్వర్యంలో పనులు చేయిస్తామని ఏఈఈ కుమార్ తెలిపారు.

భావదేవరపల్లిలో ఘనంగా పోతురాజు పోత

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామ దేవత ఉర్వేశమ్మ శత వసంతాల జాతర మహోత్సవం శుక్రవారం పోతురాజుస్వామి పోత కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలో మూడేళ్లకు ఒకసారి ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఎమ్మెల్యే సతీమణి మండలి విజయలక్ష్మి, తనయుడు వెంకట్రామ్(రాజా) ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పోతురాజు పోత పేరుతో వేప చెట్టుకు వడపప్పు, పానకం, చలిమిడి, నారికేళం నైవేద్యంగా సమర్పించారు. ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, రాజశేఖర్, మండలి కాళి, పలువురు ముత్తా పెద్దలు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉర్వేశమ్మ జాతర రెండో రోజులో భాగంగా శనివారం మద్ది రావమ్మ, గుడారం,



పోతరాజు పోతతో గ్రామ దేవత ఉర్వేశమ్మ జాతరను ప్రారంభిస్తున్న విజయలక్ష్మి తదితరులు

మదార్ సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఊరేగింపులో సాహెబ్ జెండా పట్టుకుని నడుస్తారు. రాత్రి ఏడు గంటలకు మద్ది రావమ్మ స్థావరానికి గ్రామస్తులు వేడి నైవేద్యాలతో ఊరేగింపుగా చేరుకుంటారు.

వర్షాకాలం ప్రారంభంలో పూడికతీత పనులు



నాగపోతరావు సెంటర్‌లో డ్రెయిన్‌లో సిల్ట్ తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



ఆజాద్‌రోడ్డు మార్జిన్‌లో మురుగునీటి ముంపులోనే మామిడి పండ్ల వ్యాపారం

- బందరులోని డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలు
- చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి చేరుతున్న మురుగు
- వేసవి ముగిశాక అధికారులకు గుర్తుకు వచ్చిన పూడికతీత
- మునిసిపల్ అధికారుల తీరుపై నగర ప్రజల ఆగ్రహం

మచిలీపట్నంటౌన్: వేసవిలో చేపట్టాల్సిన డ్రెయిన్లలో పూడికతీత పనులను బందరు నగరపాలక సంస్థ అధికారులు వర్షాకాలంలో చేపట్టారు. అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న పక్కా డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల తరచూ కురిసిన వర్షాలకు రహదారులు తటాకాల్లా దర్శనమిచ్చి నగరవాసులు నానా అగచాట్లకు గురయ్యారు. డ్రెయిన్లలో పూడిక పేరుకుపోయి వర్షపునీరు పారేందుకు వీలు లేక రోడ్లపైనే మురుగు తిష్టవేసింది. వేసవిలో పూడిక తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగునీరు తిష్టవేస్తోంది. దీంతో స్పందించిన మునిసిపల్ అధికారులు శుక్రవారం నుంచి ఆజాద్‌రోడ్డులోని పక్కా డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. నాగపోతరావుసెంటర్ సమీపాన ఈ పనులు చేస్తుండటంతో డ్రెయిన్‌లోని నీరు పారుదలకు ఆటంకం ఏర్పడింది.

మురుగునీటిలో మామిడిపండ్ల విక్రయాలు

ఆజాద్‌రోడ్డులోని డ్రెయిన్‌లో పూడిక తీత పనులు చేస్తుండటంతో డ్రెయిన్‌లోని మురుగునీరు ఎగదన్ని రోడ్డుపైకి చేరింది. రోడ్డు మార్జిన్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న మామిడి పండ్ల విక్రయాలు ఈ మురుగునీటి ముంపులోనే కొనసాగాయి. పండ్ల కొనుగోలుదారులు, వ్యాపారులు మురుగునీటిలోనే దిగాల్సి రావటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హోటల్ యజమానులపై చర్యలు లేకనే..

నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి పలు టిఫిన్, బిర్యానీ హోటళ్లు ఉన్నాయి. ఈ హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను డస్టు బిన్లలో నిల్వచేసి, చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించకుండా నేరుగా డ్రెయిన్లలో పడేస్తున్నారు. ఫలితంగా డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే డ్రెయిన్ల నుంచి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ఇంత జరుగుతున్నా హోటళ్ల నిర్వాహకులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో మునిసిపల్ అధికారులు వారిపై ఎలాంటి చర్యలకు సాహసించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోపిదేవి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఉయ్యూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడలోని 220 కేవీ, అవనిగడ్డలోని 132 కేవీ సబ్‌స్టేషన్లలో షెడ్యూల్డ్ మెయింటినెన్స్‌లో భాగంగా మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కోడూరు మండలంలో..

కోడూరు: అవనిగడ్డ, గుడివాడ సబ్‌స్టేషన్ల షెడ్యూల్ మెయింటినెన్స్‌లో భాగంగా శనివారం కోడూరులో విద్యుత్ కోతను విధించనున్నట్లు ఏఈ గోపీచంద్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని విశ్వనాథపల్లి, కోడూరు, మందపాకల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆక్వా చెరువులకు కూడా కోత విధించనున్నట్లు గోపీచంద్ తెలిపారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ లైన్లకు మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి 9.30 గంటల వరకు నగరంలోని గొడుగుపేట, బలరామునిపేట, విజయవాడ రోడ్డు, చెమ్మనగిరిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: మండలంలోని బంటుమిల్లి, అర్తమూరు సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా ఉండదని మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, మరి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముగిసిన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీభూనీలాపరివార సమేత రంగనాయక స్వామి ఆలయంలో ఎనిమిది రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఈఓ ఎం.సత్యప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సత్యప్రసాద్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ మాజీ చైర్మన్ వాడవల్లి బాలాజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పని సరి

మోపిదేవి: భూములు కలిగిన ప్రతి రైతూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. తమ పాస్‌బుక్ 1బీతో పాటు ఆధార్ కార్డుతో గ్రామ సచివాలయంలో ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలని పేర్కొన్నారు.

వేలిముద్రలతో ఈకేవైసీ

చల్లపల్లి: అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సాయిసింధు సూచించారు. తాజాగా వచ్చిన జాబితాల్లో పేర్లు ఉన్న రైతులు తమ వేలి ముద్రలతో మాత్రమే ధ్రువీకరణ ఇచ్చి నమోదు ప్రక్రియను పూర్తిచేసుకోవాలని పేర్కొన్నారు. ఇందు కోసం రైతులు తమ ఆధార్‌కార్డు నంబరుతో గ్రామానికి దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సాయిసింధు సూచించారు.

లబ్ధిదారులు వేలిముద్రలు వేయాలి

ఘంటసాల: అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులు ఈ నెల 20వ తేదీ లోపు వేలిముద్రలు వేయా లని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణ సూచించారు. ఘంటసాల మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల వివరాలను శుక్రవారం ప్రదర్శించారు. ఘంటసాల మండలంలోని ఘంటసాల, దేవరకోట, ఘంటసాలపాలెం రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు.

రక్తదానం చెయ్యండి.. ప్రాణాలు కాపాడండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత



రక్తదాన దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ ఆశాలత

మచిలీపట్నంఅర్బన్: రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) సూరింటెండెంట్ డాక్టర్ ఆశాలత సూచించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్వజన ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అధికసార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ.. ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు రక్త దానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో రక్తదానమే ప్రాణాలను కాపాడుతుందన్నారు. కృత్రిమంగా తయారు చేయలేని ఏకైక పదార్థం మానవ రక్తమేనన్నారు. అత్యధికసార్లు రక్తదానం చేసి తిరుమణి మురళి, విజయ్ కుమార్, విజయలక్ష్మిదేవిని అభినందించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. యువత రక్తదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆరోగ్య శాఖ ఎయిడ్స్, టీబీ అండ్ లెప్రసీ అధికారి అంబటి వెంకటరావు, ప్రొఫెసర్ అండ్ పెథాలజిస్ట్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ గీతావాణి, డాక్టర్ పావని, స్వచంద్ర సంస్థ శ్వేత ఆకూరి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నార్త్, సౌత్ విభాగాలకు సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మచిలీపట్నం నార్త్ మండలం రైతు విభాగం అధ్యక్షుడిగా గడిదేశి డేవిడ్‌రాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా భోట్ల రాము, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గడిదేశి పెదవెంకయ్య (బాలజేసు), మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ భక్షు నియమితులయ్యారు. సౌత్ మండలం యూత్ వింగ్ అధ్యక్షుడిగా కోమటి నారాయణరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కర్ర స్వప్న, రైతు విభాగం అధ్యక్షుడిగా కంచర్లపల్లి విజయసారథి, బీసీ సెల్ అధ్యక్షుడిగా తిరుమలశెట్టి జయరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గంగేయుడును నియమించారు. మచిలీపట్నం నగరపార్టీ ఉపాధ్యక్షులుగా తిరుమలశెట్టి వరప్రసాద్, షేక్ మొహమ్మద్ సాహెబ్ నియమితులయ్యారు.

19న కృష్ణా నదిలో జల యోగ



జలయోగ సాధన చేస్తున్న వారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, డీఎస్పీ, తహసీల్దార్

నాగాయలంక: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శ్రీపాద క్షేత్రం వద్ద కృష్ణానదిలో ఈ నెల 19న జల యోగ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం నాగాయలంక గ్రామ పరిధిలోని కృష్ణానది తీరంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక జగ ఈతగాళ్లు, ఔత్సాహికులతో కృష్ణానదిలో జల యోగ ట్రయిల్ రన్ నిర్వహించారు. ఈతలో నిష్ణాతులైన 200 మందితో నదిలో జల యోగా జరపాలని నిర్ణయించారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యాశ్రీ, తహసీల్దార్ ఎం.హరనాథ్‌తో నదిలో యోగ నిర్వహణపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చర్చించారు. ఏఎంసీ మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు, ఈత నిపుణుడు గడ్డిపాటి సుధీర్‌బాబు, సుదర్శి మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.

ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతే..



ఘంటసాల బౌద్ధస్తూపం వద్ద యోగా సాధన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, అధికారులు

ఘంటసాల: ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమేనని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల బౌద్ధస్తూపం వద్ద ఆయుష్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీఓ కె.స్వాతి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, డీఎస్పీ టి.విద్యశ్రీ, ఇతర అధికారులు పాల్గొని ప్రజలతో పాటు యోగా సాధన చేశారు. ప్రత్యేక వేదికపై యోగా శిక్షకుడు రెబ్బా పోతనశాస్త్రి ఆసనాలు చేయించి యోగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. పవిత్రమైన బౌద్ధ స్తూపం ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించడం ఘంటసాలకే గర్వకారణమన్నారు. రెండు వేల సంవత్సరాల క్రితం బౌద్ధ ధర్మాన్ని ఇతర దేశాలకు వ్యాపింపచేయడంలో ఘంటసాల బౌద్ధ క్షేత్రానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ఘంటసాల బౌద్ధస్తూపం వద్ద ఏర్పాటు చేసిన కలెక్టర్ డి.కె.బాలాజీకి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్వో చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ప్రజలందరూ యోగా ప్రాముఖ్యతను తెలుసుకుని తమ జీవన శైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యోగా విన్యాసాలతో పాటు యార్లగడ్డ గ్రామానికి చెందిన బాలబాలికలు యోగా ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. యోగా శిక్షకులు, చిన్నారులను అతిథులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రజలందరికి తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా సమన్వయకర్త పోతురాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.రామలక్ష్మణరావు, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ జావేద్ ఖాన్, డాక్టర్ వాహిని, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఏఓ కె.మురళీ కృష్ణ, యోగా గురువులు మద్దాల చింతయ్య, నాగరాజు, శేష ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సైంటిస్ట్‌గా ఎదిగిన పూర్వ విద్యార్థికి ఘన సత్కారం



దాక్టరు సాయిశ్రీనివాస్, విద్యార్థులను సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

బంటుమిల్లి: మండలంలోని పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, జీఎఫ్‌సీఎల్ సైంటిస్ట్ డాక్టరు యర్రంశెట్టి సాయిశ్రీనివాస్‌ను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. 2009–10 సంవత్సరంలో పదో తరగతి చదివిన సాయిశ్రీనివాస్ అంచలంచెలుగా ఎదిగి గుజరాత్ ఫ్లోరో కెమికల్స్ లిమిటెడ్(జీఎఫ్‌సీఎల్)లో సైంటిస్ట్‌గా ఎంపికయ్యారు. గ్రామానికి, తమ పాఠశాలకు మంచి పేరు తెచ్చిన శ్రీనివాస్‌ను మాజీ సర్పంచులు బండారు సత్యనారాయణ, ప్రత్తి బాబ్జి, హెచ్‌ఎం మాగంటి నాగబాబు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 2024–25 సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు దాటిన విన్నకోట సాయిలక్ష్మీ దుర్గ (579), లింగం ఉషశ్రీ (551), అనందాసు డీల్సీ నాగలవ్య (548), తోట సాయిగౌతమి (514)ని ఘనంగా సత్కరించారు. వారికి కేసిరెడ్డి నాగేశ్వరరావు రూ.11 వేల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాదాసు లక్ష్మీశకుంతల, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రత్తి రామారావు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

అవనిగడ్డ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మరణించిన వారికి స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావుతో పాటు విద్యార్థులు మౌనం పాటించి విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.